సాక్షి
బాపట్ల
గురువారం। 24। జూలై। 2025



దుర్గమ్మకు ఆషాఢ సారె

తాడేపల్లి రూరల్ : మంగళగిరి దుర్గానగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్, అనిత దంపతులు ఆషాఢ సారెను సమర్పించారు.



వర్మీ కంపోస్టు యార్డు పరిశీలన

తెనాలి టౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డును బుధవారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ముల్లా యేసుబాబు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఘనంగా బోనాల పండుగ

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడులో బుధవారం ముత్యాలమ్మకి మహిళలు బోనాలు సమర్పించారు. వానలు కురవాలని ప్రత్యేక పూజలు చేశారు.

నీటిపై రాతలా జలమార్గం

ఒకప్పుడు కాకినాడ నుంచి నాటి మద్రాసు వరకు విస్తరించిన బకింగ్ హాం కాలువ జల రవాణాలో కీలకపాత్ర పోషించింది. బ్రిటిష్ వారి కాలంలో నిత్యావసర సరుకులు జలరవాణా ద్వారానే ఎక్కువగా అందుతుండేవి. ఆ కాలువ ప్రస్తుతం రూపు రేఖలు కోల్పోయింది. పునరుద్ధరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

- బ్రిటిష్ కాలంలో సౌకర్యవంతంగా సాగిన సరుకు రవాణా
- పునరుద్ధరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ మీనమేషాలు
- అంచనాలకు మాత్రమే పరిమితమైన పనులతో దక్కని ప్రయోజనం

బకింగ్ హాం కాలువకు దక్కని పూర్వ వైభవం



చినగంజాం వద్ద కొమ్మమూరు కాలువ బకింగ్ హాం కాలువగా మారుతున్న ప్రాంతం

చినగంజాం: ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ నుంచి తమిళనాడు ప్రాంతంలోని పుదుచ్చేరి వరకు కొనసాగే బకింగ్ హాం కాలువ రాష్ట్రంలోని తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా జలరవాణా మార్గాన్ని పునరుద్ధరించేందుకు ఎప్పటి నుంచో ప్రతిపాదనలున్నాయి. కానీ అవి ముందుకు మాత్రం కదలడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటలు నీటి మీద రాతలుగానే మిగిలాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపగా, సర్వేకు ఆదేశాలు జారీ అయ్యాయి. పనులు మాత్రం ముందుకు సాగలేదు. ఆంగ్లేయుల పాలనలో 1806లో ఆనాటి బ్రిటిష్ పాలకులు బకింగ్ హాం కాలువ నిర్మాణం చేపట్టారు. జల మార్గం ద్వారా సౌకర్యవంతంగా తక్కువ ఖర్చుతో నిత్యావసర సరుకులు వరణా చేసేవారు. 1876–78 లో కరువు కోరల్లో చిక్కుకున్న దక్షిణ భారతదేశాన్ని ఈ కాలువ కాపాడింది. 1965లో వచ్చిన తుపాన్, వరదల కారణంగా కాలువ దెబ్బతిని పూర్తి నిరుపయోగంగా మారింది. అప్పటి నుంచి ఆక్రమణల చెరలో కుంచించుకుపోయింది.

అడుగు ముందుకు పడని పనులు

కోస్తా తీరం వెంబడి ప్రయాణించే కాలువలో నావికా యోగ్యంగా 420 కి.మీ. వరకు ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి కృష్ణా జిల్లా నల్లమడ లాకుల నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లా పెదగంజాం వరకు(257 కి.మీ.) కొమ్మమూరు కాలువగా పిలుస్తారు. అక్కడి నుంచి నెల్లూరు జిల్లా మీదుగా తమిళనాడు రాష్ట్రంలోని విల్లుపురం జిల్లా వరకు బకింగ్ హాం కాలువ(163 కి.మీ.) విస్తరించి ఉంది. పెదగంజాం నుంచి సహజసిద్ధమైన కాలువ మార్గం ద్వారా చెన్నై నౌకాశ్రయానికి కలుపబడిన జలమార్గం ఇది. ఈ మార్గం పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అంచనాలు చేపట్టింది. అడుగు ముందుకు పడలేదు. కృష్ణా డెల్టా పరివాహకంగా ఉన్న కొమ్మమూరు కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టి కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం జలరవాణా మార్గం ప్రకటన చేయడంతో నీటి పారుదల శాఖ అప్రమత్తమైంది. ఈ పనుల్లో భాగంగా చేపట్టిన వంతెనల నిర్మాణాన్ని నిలిపివేసింది. పడవల రవాణాకు అనుకూలంగా డిజైన్‌లు మార్చవలసి వస్తుందని ఆలోచనతో పనులు నిలిపివేశారు.

రూ. 3 వేల కోట్లు ఖర్చు అంచనా

సుమారు 32 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతు ఉండేలా కాలువను తిరిగి డిజైన్ చేసి.. 30 నుంచి 40 టన్నుల బరువు సరుకును రవాణా చేసే ఓడలు ప్రయాణం చేసేలా అభివృద్ధి చేసేందుకు సుమారు రూ. 3 వేల కోట్లు ఖర్చు అవుతుందని సంబంధిత కన్సల్టెన్సీ సంస్థ నివేదించింది. జల రవాణాను పునరుద్ధరిస్తే ఏడాదికి సుమారు 11 మిలియన్‌ల టన్నుల సరుకును రవాణా చేసే అవకాశం ఉందని సర్వే సంస్థ పేర్కొంది. నావిగేషన్ కెనాల్‌గా ఉపయోగించవచ్చని తెలిసినా ప్రభుత్వంలో ఎటువంటి కదలిక లేదు. కాలువ అభివృద్ధి చేస్తే అమరావతికి బహుళ ప్రయోజనకారిగా ఉండనుంది.

పర్యాటక రంగానికి ఊతం

ప్రస్తుతం కాలువ ఆక్రమణల చెరలో చిక్కుకొని రొయ్యల చెరువులు, ఇతర నిర్మాణాలతో కుంచించుకుపోయింది. కెనాల్ అభివృద్ధి చేయాలంటే భూ సేకరణకు రూ. 391 కోట్లు, డ్రెడ్జింగ్ కోసం రూ. 333 కోట్లు ఖర్చు అవుతుందని అప్పట్లో సర్వే సంస్థ తేల్చి చెప్పింది. గతంలో ఉన్న లాకులు ధ్వంసం అవడంతో అత్యంత విలువైన కలప, రాగి రేకులు దొంగలపాలయ్యాయి. కెనాల్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు 420 కి.మీ. పరిధిలో 48 లాకులు, 15 టెర్మినల్స్ నిర్మించడం ద్వారా అందుబాటులోకి తీసుకొని రావచ్చని నిపుణులు చెబుతున్నారు. జలరవాణాతో పాటు పర్యాటక రంగానికి కూడా తోడ్పాటు అందించే అవకాశాలున్నాయి.



కృష్ణా జిల్లా నుంచి చినగంజాం ప్రాంతానికి వస్తున్న కొమ్మమూరు కాలువ

న్యూస్‌రీల్

నేడు ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని కృష్ణా జిల్లా గన్నవరం మండలం ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఉప కులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఆమె వివరాలు వెల్లడించారు. విశ్వవిద్యాలయ గౌరవ కులపతి, గవర్నర్ ఎస్. అబ్దుల్‌నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. పూర్వ విద్యార్థి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పంజాబ్ గవర్నమెంట్, డైరెక్టర్ పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఏ. వేణుప్రసాద్ పాల్గొంటారని ఆమె తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచినవారికి స్నాతకోత్సవంలో పురస్కారాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఇంటి సిలిండర్లు వ్యాపారానికి వాడితే చర్యలు



గుంటూరు వెస్ట్: గృహ అవసరాలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను వ్యాపారాలకు వాడితే చర్యలు తప్పవని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి ఆర్.చంద్రముని తెలిపారు. గత రెండు రోజులుగా నగరంలో 20 రెస్టారెంట్లు, టిఫిన్ బండ్లపై సిబ్బందితో దాడులు చేసినట్లు చెప్పారు. ఇందులో 147 డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపారాలకు ఉపయోగిస్తునట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని 30 మందిపై 6–ఏ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇక నుంచి తరచూ తనిఖీలు చేస్తామని ఆయన వెల్లడించారు.

వైభవంగా శాకంబరీ దేవి ఉత్సవాలు



తెనాలి: స్థానిక గాంధీ చౌక్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో బుధవారం శాకంబరీ దేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో హరిప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు జంపని నాగ భాస్కర్ ఉత్సవాలను వైభవోపేతంగా జరిపారు. అమ్మవారిని వివిధ కూరగాయలతో విశేషంగా అలంకరించారు.అర్చకులు పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆలయంలో శాకంబరీ దేవి ఉత్సవాలను నిర్వహించినట్టు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడి పంటలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు తాళాబత్తుల ఉదయ్‌శంకర్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా దుర్గమ్మ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పెదకోనేరులోని శ్రీ దుర్గా భవాని ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం శాకంబరీ దేవి అలంకారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు కూర్మాల బాలసాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కూర్మాల దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు అమ్మవారికి అలంకార ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలి రోజు అమ్మవారిని కూరగాయలతో శోభాయమానంగా అలంకరించామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రావణ మాసం ప్రారంభం రోజు పూలతో అలంకరించి పూజలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

డీఆర్‌ఓ జి.గంగాధర్‌గౌడ్



బాపట్ల: గంజాయి రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో ఈగల్ టీంలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. యువత, విద్యార్థులు ఎక్కువగా వినియోగిస్తున్నారని అన్నారు. వ్యక్తిగతంగా నష్టపోవడంతోపాటు సమాజంలోనూ తీవ్ర దుష్పరిణామాలు ఉత్పన్నం అవుతున్నాయని అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రభుత్వ అధికారులతోపాటు విద్యాసంస్థల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా సహకారాన్ని అందించాలన్నారు. క్రైం డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ అధికారులు అందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో 2022 –25 సంవత్సరం వరకు మొత్తం 73 కేసులు నమోదు చేశామని తెలిపారు. జిల్లాలో 64 మంది గంజాయి సరఫరా, 275 మంది విక్రేతలను గుర్తించామని చెప్పారు. విస్తృత తనిఖీలు చేయడంతోపాటు జిల్లాలో 14 యాంటీ గంజాయి టీంలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గంజాయి రవాణా, సరఫరా వివరాలు తెలిస్తే వివరాలను 1972 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి, పోర్టు అధికారి బీవీఎం మూర్తి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ అధికారి రాజ్‌దేబోరా, వికలాంగుల సంక్షేమ అధికారి సువార్త, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, షాడో స్వచ్ఛంద సంస్థ ఎన్జీవో రాజా సాల్మన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగుపై నిషేధం

- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- రైతులు సహకరించాలని సూచన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు సాగుపై నిషేధం విధించినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఈ ఏడాది సదరు ఆదేశాలను ఉల్లంఘించే రైతులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం బాపట్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ మురళి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రైవేట్ బయ్యర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కంపెనీల హామీలతో రైతులు అధికంగా బ్లాక్ బర్లీ సాగు చేశారని తెలిపారు. కొనుగోలు సమయంలో కొన్ని కంపెనీలు వెనకడుగు వేశాయన్నారు. డిమాండ్‌కు మించి సాగు వల్ల మార్కెట్‌లో ధరలు గణనీయంగా పడిపోయాయని, ఇది రైతుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపిందని వివరించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో బ్లాక్ బర్లీ పంట సాగు చేయకూడదని, ఇది పూర్తిగా నిషేధితమని పునరుద్ఘాటించారు. నర్సరీలలోనూ బ్లాక్ బర్లీ నారు సాగు చేయటం కూడా నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే వ్యవసాయ శాఖ అధికారులు ఆ పంటను ధ్వంసం చేయడంతోపాటు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. రైతులు ప్రత్యామ్నాయ, లాభదాయక పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే పండించిన బ్లాక్ బర్లీ పొగాకును రైతులు ప్రైవేట్ కంపెనీలకు విక్రయించవచ్చని తెలిపారు. వర్షాల ప్రభావం నుంచి పంటను రక్షించుకోవాలని, తేమ శాతం 20% మించిన బేళ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావద్దని స్పష్టం చేశారు. ప్రతి రైతు పండించిన పంట మొత్తం కొనుగోలు చేస్తామని తెలిపారు.

‘అక్షర ఆంధ్ర’ను విజయవంతం చేద్దాం

బాపట్ల: అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్షరాస్యత పెంపునకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమానికిగాను గ్రామ స్థాయిలో వయోజన విద్యా కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ‘ఉల్లాస్’ – అక్షర ఆంధ్ర కార్యక్రమంలో జీవితాంతం నేర్చుకునే అవకాశాల కల్పన కోసం కేంద్ర ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఆర్థిక, సాంకేతిక, క్రియాత్మక అక్షరాస్యత సాధించే దిశగా అడుగులు వేయాలని ఆయన చెప్పారు. అమలులో వలంటీర్లు , ఉపాధ్యాయులు, విద్యాసంస్థల పాత్ర కీలకమని అన్నారు. స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తీసుకోవాలని కోరారు. జిల్లాలో పీ–4 మార్గదర్శకులతో గ్రామాలలో ఉన్న నిరక్షరాస్యులను మ్యాపింగ్ చేయాలన్నారు. సమావేశంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

‘పచ్చ’ కార్యాలయంలో అధికారుల సమావేశం



రేపల్లె ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ ప్రజాప్రతినిధి హోదాలో పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వ్యవసాయ శాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశం చర్చనీయాంశంగా మారింది. ఆయన ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించడంపై ప్రజలు, ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మితోపాటు నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులు హాజరయ్యారు. మంత్రి ఇక్కడ క్రియాశీలకంగా లేకపోవడంతో బదులుగా ఆయన సోదరుడు శివప్రసాద్ ఇలా సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలలో జోక్యం చేసుకుంటున్నారని అధికారులు బహిరంగంగానే వాపోతున్నారు.

– రేపల్లె

లైసెన్స్ ఫీజులు చెల్లించకుంటే కఠిన చర్యలు

- ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

సాక్షి ఎఫెక్ట్

చీరాల: మద్యం షాపులు, రెస్టారెంట్ అండ్ బార్ నిర్వహణకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. ఎక్సైజ్ శాఖకు చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులను బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు చెల్లించడంలేదని బుధవారం ‘సాక్షి’లో ప్రచురితమైన ‘ఎక్సైజ్ శాఖకు టోపీ’ అనే కథనానికి జిల్లా ఎక్సైజ్ శాఖ స్పందించింది. ఈ మేరకు బి.వెంకటేశ్వర్లు బుధవారం చీరాలలోని ఎక్సైజ్ స్టేషన్‌లో యజమానులతో సమావేశం నిర్వహించారు. లైసెన్స్ ఫీజులు చెల్లించని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, కాలపరిమితి దాటిన మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనల మేరకు ప్రకటించిన సమయానికే నిర్వహించాలని కోరారు. ఈ విషయమై నోటీసులు ఇచ్చామన్నారు. బెల్ట్ షాపుల నియంత్రణకు నిత్యం నిఘా ఉంటుందన్నారు. సమాచారం ఇవ్వదలచిన వారు 14405, 9440902495 కు కాల్ చేయాలన్నారు. సీఐ పి.నాగేశ్వరరావు, ఎస్సై బి.శ్రీహరి పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధి అమలేదీ?

- నెలకు రూ.1,500 ఇస్తామని ఎన్నికల్లో కూటమి ప్రచారం
- ఓట్లేసి గెలిపిస్తే ఆడబిడ్డలకు అండగా నిలబడతామని హామీ
- గద్దెనెక్కాక ఆ విషయమే మరిచిపోయిన కూటమి సర్కార్
- జిల్లాలో దాదాపు 5.76 లక్షల మంది అర్హులు
- ఇప్పటివరకు వారికివ్వాల్సిన మొత్తం రూ.1,124.94 కోట్లు
- కూటమి ప్రభుత్వం నయవంచనపై మహిళలు తీవ్ర ఆగ్రహం
- ఇకనైనా చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలని డిమాండ్



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ‘ఓట్లేసి గెలిపిస్తే 19 నుంచి 59 సంవత్సరాలలోపు మహిళలందరికీ నెలకు రూ. 1500 చొప్పున ఏడాదికి రూ. 18 వేలు ఇస్తాం. ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అందరికీ అందజేస్తాం’.. అంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సహా కూటమి నేతలు ఇచ్చిన హామీ ఇది. కానీ ఓట్లు పడి గద్దెనెక్కాక ప్రభుత్వ స్వరం మారింది. దీనిపై మహిళలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఆడబిడ్డ నిధి పథకం కింద 19 – 59 ఏళ్లలోపు మహిళలందరికి నెలకు రూ.1500 ఇస్తామని కూటమి నేతలు చెప్పారు. ఏడాది దాటినా మహిళలకు ఒక్క పైసా కూడా చెల్లించలేదు. నమ్మి ఓట్లేసి గెలిపిస్తే నయవంచనకు పాల్పడ్డారని చంద్రబాబు తదితరులపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే బకాయి పడిన సర్కార్

జిల్లాలో 6,61,958 మంది మహిళలు ఉండగా.. ఇందులో 15 శాతం మంది పింఛనుదారులు. వారు పోగా 5,76,893 మంది మహిళలు ఉన్నారు. వీరందరికి నెలకు రూ. 1500 ప్రకారం రూ. 86.53 కోట్లు ఇవ్వాలి. కూటమి అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్నందున మొత్తం రూ.1124.94 కోట్లు చెల్లించాలి. ప్రభుత్వం పైసా కూడా చెల్లించలేదు.

నియోజకవర్గాలవారీగా మహిళలకు 13 నెలలకుగాను చెల్లించాల్సిన మొత్తం

నియోజకవర్గం	అర్హుల సంఖ్య	ఇవ్వాల్సిన మొత్తం
వేమూరు	86,645	168,95,77,500
రేపల్లె	98,719	192,50,20,500
బాపట్ల	83,288	162,41,16,000
పర్చూరు	99,120	193,28,40,000
అద్దంకి	1,06,561	207,79,39,500
చీరాల	1,02,560	199,99,20,000
మొత్తం	5,76,893	1124,94,13,500

ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి



ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చి ఓట్లేయించుకున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్కపైసా ఇవ్వలేదు. గడిచిన 13 నెలల కాలానికి ఒక్కొక్కరికి రూ.19,500 ఇవ్వాలి. ఇలా మోసగించడం సరికాదు. ప్రభుత్వం వెంటనే మహిళలకు డబ్బులు చెల్లించాలి.

– బెల్లంకొండ శివపార్వతి, బలిజపల్లి గ్రామం, వేమూరు మండలం

ఆడబిడ్డలను మోసగించడం తగదు



ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. వారి మాటలు నమ్మి ఆడపడుచుల ఓట్లు పడ్డాయి. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఇచ్చిన హామీ అమలు చేస్తారని భావించాం. సంవత్సరం దాటినా పైసా ఇవ్వలేదు. ఒక్కొక్కరికీ రూ.19,500 రావాలి. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన బకాయి మొత్తం చెల్లించాలి. ఆడబిడ్డలను వంచించడం మంచిది కాదు.

– సీతామహాలక్ష్మి, ఓడరేవు, చీరాల నియోజకవర్గం

క్లుప్తంగా

శైవక్షేత్ర రాష్ట్ర అధ్యక్షుడిగా జూలకంటి



పిడుగురాళ్ల: శ్రీ శైవక్షేత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా జూలకంటి శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. శ్రీ శైవ క్షేత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం సాయంత్రం విజయవాడలోని తాళ్లయపాలెంలోని శ్రీ శైవ క్షేత్ర దేవాలయ ప్రాంగణంలోని ధర్మో రక్షిత రక్షిత సమావేశ మందిరంలో జరిగింది. క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీ శివస్వామి రాష్ట్ర అధ్యక్షుడిగా జూలకంటి శ్రీనివాసరావును ప్రమాణ స్వీకారం చేయించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. దీంతో శ్రీనివాసరావును పిడుగురాళ్ల పట్టణ ప్రముఖులు అభినందించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికై నట్లు పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి. సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. విశాఖలో ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాటర్ పోలో ఎంపిక పోటీలో ఆర్.హర్షవర్ధన్‌రాజు, వై.మధుకిషోర్, కె.శివసాకెత్ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. బెంగుళూరులో ఆగస్టు 4 నుంచి 8వతేదీ వరకు జరగనున్న 51వ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో వాటర్ పోలో క్రీడలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అలాగే విశాఖలో నిర్వహించిన పోటీల్లో అండర్–17 బాలికల విభాగంలో జీఎస్ఎస్ నిత్య 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు తెలిపారు. క్రీడాకారులను కోచ్ జి.సురేష్, సుబ్బారెడ్డి అభినందించారు.

పేదల అభ్యున్నతికి పాటుపడాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం ఆర్థికంగా వృద్ధి చెందిన వారు ముందుకు వచ్చి వారిని దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలను అభివృద్ధి చేసేందుకు పీ–4 పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా మార్చి నుంచి నిర్వహించిన సర్వేలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 1.20 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. గ్రామ సభల ద్వారా వారిని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్దలతో చర్చించి అర్హత ఉన్నవారందరినీ జాబితాలో చేర్చామని తెలిపారు. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్నవారు వ్యక్తిగతంగా, సంస్థల పరంగా బంగారు కుటుంబాలను దత్తతకు తీసుకుని సహకారం అందించాలని ఆమె కోరారు. బంగారు కుటుంబాల్లోని పిల్లల విద్యా అవసరాలు, చిరు వ్యాపారులను ప్రోత్సహించడానికి మెంటార్‌గా, ఇతర అంశాల్లోనూ మార్గదర్శులు సహాయం అందించాలని తెలిపారు. ప్రభుత్వ విజన్– 2047 స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు వేయాలంటే పీ–4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సీపీఓ శేషశ్రీ , ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

జ్వరాల ఆస్పత్రిలో పాముల సంచారం


ఆస్పత్రిలోకి వచ్చిన పామును కొట్టి చంపిన సిబ్బంది

గుంటూరు మెడికల్ : గోరంట్లలోని ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిత వ్యాధుల ఆస్పత్రి(జ్వరాల ఆస్పత్రి)లో పాములు సంచారంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి రెండు పాములను చంపగా, బుధవారం మరొకటి వంటగదిలో ప్రత్యక్షమైంది. వాస్తవానికి ఆస్పత్రి శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పరిశుభ్రంగా ఉంచి పాములు, ఇతర క్రిమికీటకాలు లోపలకు రాకుండా చర్యలు తీసుకోవాలి. అయితే, కాంట్రాక్టర్ పట్టించుకున్న దాఖలా లేదు. పాములు వార్డుల్లోకి వచ్చిన తరువాత అయినా బుధవారం ఆస్పత్రి అంతా స్పెషల్ డ్రైవ్ చేసి, పరిశుభ్రం చేయకపోవడంతో మరలా పెద్దపాము ఏకంగా కిచెన్‌లోకి ప్రవేశించి, సిబ్బంది గుండె ఆగిపోయేంత పని చేసింది. ఆస్పత్రిలో పాముల సంచారం గురించి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘును సాక్షి వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. పాములు రాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

లక్ష్మీపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏ.వి. నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాత గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ముందుగా యూనియన్ జెండాను సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణారావు, సీఐటీయూ జెండాను వి. ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 లోపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ఎమ్మెల్యేలను ఎక్కడికి అక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను చైతన్యంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పలు తీర్మాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు మహాసభల నివేదికను ప్రతినిధుల ముందు చర్చకు పెట్టారు. కార్యక్రమంలో వర్కింగ్ ఉమెన్ రాష్ట్ర నాయకురాలు దయా రమాదేవి తదితరులు ప్రసంగించారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: దిశ డాన్ బాస్కో సేవా విభాగ ఆధ్వర్యంలో ఈనెల 25న విద్యానగర్‌లోని డాన్‌బాస్కో ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.జీవన్, ప్రిన్సిపాల్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఫ్యూచర్ ప్రాపర్టీ, ఇన్నో సోర్స్, కేప్‌స్టన్, మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, పేటీఎం, శ్రీరామ్ ఫైనాన్స్, హీరో మోటోకార్ప్, ఫోర్ట్ మేనేజ్‌మెంట్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేకుండా నేరుగా హాజరు కావచ్చునని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 79811 72216, 82972 42547, 80730 31426 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

12 మండలాల్లో మోస్తరు వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో 12 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్లూరు మండలంలో 42.4 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1.6 మి.మీ. కురిసింది. సగటున 9.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడికొండ మండలంలో 31.4 మి.మీ., పెదకాకాని 30.4, దుగ్గిరాల 16.8, మంగళగిరి 16.2, తాడేపల్లి 9.6, కొల్లిపర 7.2, మేడికొండూరు 5.6, గుంటూరు పశ్చిమ 3.2, గుంటూరు తూర్పు 2.6, తెనాలి మండలంలో 2.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూలై 23వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 122.4 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 197.8 మి.మీ. నమోదైంది.

28న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 28న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలోని సీసీఎల్ లిమిటెడ్, కృష్ణాజిల్లా పెదఅవుటపల్లిలోని హైటెక్ ప్రింట్ సిస్టమ్స్ లిమిటెడ్, ఒంగోలులోని ఈఎస్ఐసీ బ్రాంచ్ కార్యాలయం, విజయవాడలోని ఈఎస్ఐసీ బ్రాంచ్ కార్యాలయం, నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల, బాపట్ల జిల్లా నందిరాజుతోటలోని ప్రకాష్‌నగర్ గ్రామసిరిలో నిధి ఆప్‌కే నికత్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులంతా పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

వైఎస్సార్ సీపీ క్యాడర్ భయపడదు

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్‌సీపీ క్యాడర్‌పై కూటమి సర్కార్ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి, బాపట్ల జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ముఖ్యనేత, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ ప్రభుత్వం కక్షపూరితంగా, రాజకీయ దురుద్దేశంతో, లేని లిక్కర్ స్కాంను సృష్టించి అరెస్ట్ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను మరచిపోయి వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడం కక్ష సాధింపు కాదా అని ప్రశ్నించారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మసలుకోవాలని హెచ్చరించారు. పెద్దిరెడ్డి కుటుంబానికి, నాయకులకు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కుటుంబం పూర్తి అండగా ఉంటుందన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం ఓ కౌలు రైతు విద్యుదాఘాతంతో కౌలు మృతి చెందినట్లు బంధువులు పేర్కొన్నారు. మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన బి.నరసింహారావు (38) గత పదేళ్ల క్రితం రామిరెడ్డి పొలం కౌలుకు తీసుకొని అప్పటి నుంచి ఏటా సేద్యం చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరలో కరెంట్ మీటర్ దగ్గర బోర్డు పనిచేస్తున్నారని, విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు చెప్పారు. ఆయనకు భార్య నాగలీల ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఆరేళ్ల జైలు

రేపల్లె: ఓ వ్యక్తిని కత్తితో హత్య చేయడానికి ప్రయత్నించిన కేసులో నిందితుడికి ఆరు సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల బుధవారం తీర్పు వెలవరించారు. పట్టణానికి చెందిన ఆర్‌కే జ్యూయలర్స్ నిర్వాహకుడు జక్కం రామకృష్ణ భార్యపై పట్టణానికి చెందిన పడకల వెంకటేశ్వరరావు 2017 సెప్టెంబర్ 11న అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపణలు వచ్చాయి. దీనిపై జక్కం రామకృష్ణ నిలదీశారు. వెంకటేశ్వరరావు చాకుతో రామకృష్ణపై దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. బాధితుడి ఫిర్యాదుతో రేపల్లె ఎస్ఐ బాలనాగిరెడ్డి కేసు నమోదు చేశారన్నారు. దర్యాప్తులో నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనగాని శ్రీనివాసమూర్తి వాదించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి



చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చినగంజాం–ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ల మధ్య దిగువలైన్‌లో చోటుచేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య బుధవారం తెలిపారు. మృతుని వయస్సు 30 సంవత్సరాలు ఉంటాయని, 5.5 అడుగుల ఎత్తు, ఛామనఛాయ రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. మృతుని కుడి రిబ్స్‌పై ఒక నల్లని పుట్టుమచ్చ, ఎడమ భుజంపై ఒక నల్లని పుట్టుమచ్చ ఉందన్నారు. మృతుని శరీరంపై నలుపు రంగు గడులు కలిగిన ఫుల్‌హ్యాండ్ షర్ట్, వెలిసిపోయిన బ్లూ జీన్స్ ప్యాంట్ ఉందని, ఎడమచేయి ఉంగరం వేలుకు తాబేలు బొమ్మ ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

బస్సు ఢీకొని యాచకుడు మృతి



మార్టూరు: జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యాచకుడు మృతి చెందాడు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి ఒంగోలు వెళుతున్న ఇంద్ర బస్సు బొల్లాపల్లి టోల్‌గేట్ సమీపంలోకి వస్తున్న క్రమంలో ఓ యాచకుడు హఠాత్తుగా రోడ్డుపైకి రావటంతో బస్సు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన యాచకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సును స్టేషన్‌కు పంపి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

షిర్డీ నుంచి గుంటూరు వెళుతుండగా ప్రమాదం


ధ్వంసం అయిన డివైడర్

నరసరావుపేట టౌన్: ప్రయాణికులతో వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నిత్యం రద్దీగా ఉండే గడియార స్తంభం సెంటర్‌లో ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. పోలీసుల కథనం ప్రకారం.. షిర్డీలో ప్రయాణికులను ఎక్కించుకొన్న మారుతి సుధాశ్రీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు గుంటూరుకు బయలు దేరింది. మార్గమధ్యంలో తెల్లవారు జామున నరసరావుపేట గడియార స్తంభం వద్దకు వచ్చే సరికి ఆగి ఉన్న లారీని క్రాస్ చేసే క్రమంలో అదుపుతప్పి బస్సు డివైడర్‌ను ఢీకొంది. సంఘటనలో బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. సంఘటనతో ట్రాఫిక్ నిలిచి పోయింది. సమాచారం అందుకున్న సీఐ లోకనాథం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రెంటపాళ్లలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడి


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: మిరప నారు దిబ్బల పైకి గొర్రెల మందను వదలడమే కాకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులపై సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో టీడీపీ సానుభూతిపరులు మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా రెంటపాళ్ల గ్రామానికి చెందిన వల్లెపు రాంబాబు, వల్లెపు రవితేజ, వల్లెపు వీరయ్య మిరప నారు దిబ్బలు సాగు చేస్తుండగా టీడీపీ సానుభూతిపరులైన నంబుల కాటంరాజు, యాగంటి బాబురావు, సైదయ్యలకు చెందిన గొర్రెల మంద పడటంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తులైన కాటంరాజు, బాబురావు, సైదయ్యలు దాడి చేయడంతో వల్లెపు రాంబాబు, వల్లెపు రవితేజ, వల్లెపు వీరయ్యలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ప్రతిగా టీడీపీ సానుభూతిపరులు కూడా ఫిర్యాదు చేశారు. గాయపడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైఎస్సార్ సీపీ నాయకులు కొర్లకుంట వెంకటేశ్వర్లు, కొమ్మెర శివశంకర్, కొమెర వీరాంజి, మారిశెట్టి వెంకట్రావు, వల్లెపు సహదేవుడు, గంగిలి ఏసోబు, చల్లా వెంకటేశ్వర్లు, తదితరులు పరామర్శించారు.

నోటీసులు ఇచ్చిన గంటకే సస్పెన్షన్

- కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న అధికారులు
- లింగంగుంట్ల రేషన్ డీలర్ యెండ్లూరి ఉదయలక్ష్మి ఆవేదన

పెదకూరపాడు : కూటమి ప్రభుత్వం అధికారులను అడ్డుపెట్టుకొని తనపై, తన కుటుంబ సభ్యులపై కక్ష సాధింపులకు పాల్పడుతుందని లింగంగుంట్ల గ్రామానికి చెందిన 18 వ నంబరు రేషన్ షాప్ నిర్వాహకురాలు యెండ్లూరి ఉదయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం లింగంగుంట్ల గ్రామంలో తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనిఖీలు చేసిన గంటకు నోటీసులు ఇచ్చి తమ షాపులో ఉన్న రేషన్ స్టాకును వేరే షాప్ కు తరలించారన్నారు. ఇంట్లో మేం లేని సమయంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం తనపై, తన కుటుంబం పై దుష్ప్రచారం చేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

స్టాకు లెక్కల్లో తేడా వల్లే...

కాగా, ఈ విషయమై సివిల్ సప్లయిస్ డెప్యూటీ తహసీల్దార్ చీమలను వివరణ కోరగా ఈనెల 9న మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో శ్రీ విఘ్నేశ్వర స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ రేషన్ షాపును తనిఖీ చేయగా నిల్వల కన్నా అధికంగా 125 కేజీలు బియ్యం, ఐదు కేజీలు పంచదార ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామని, దీనిపై 6–ఏ నమోదు చేసి ఆర్డీవోకు రిపోర్ట్ చేశామని తెలిపారు. ఈనెల 21వ తేదీన ఆర్డీవో షాపును సస్పెండ్ చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చామన్నారు. మిగిలిన స్టాకును స్వాధీనం చేసుకునేందుకు వెళ్ళగా రేషన్ షాపు నిర్వాహకులు సహకరించకపోవడంతో పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

అందుబాటులో 1,681 మెట్రిక్ టన్నుల ఎరువులు


కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు, ఏఓ సుబ్బారెడ్డి తదితరులు

సత్తెనపల్లి: ఖరీఫ్ సాగుకు సత్తెనపల్లి పట్టణ, గ్రామీణ పరిధిలోని ఎరువుల దుకాణాల్లో 1,681 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో గల గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణ, గ్రామీణ పరిధిలోని ఎరువుల దుకాణాల్లో యూరియా–590 మెట్రిక్ టన్నులు, డీఏపీ– 327 మెట్రిక్ టన్నులు, పొటాష్ ఎరువులు –95 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్సు ఎరువులు–585 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ–84 మెట్రిక్ టన్నులు నిల్వలు ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. రైతులందరూ మీ మీ గ్రామాల పరిధిలో ఉన్నటువంటి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద, ప్రైవేట్ ఎరువుల దుకాణాలు వద్ద నుంచి ఎరువులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో హతమార్చి నంద్యాలలో డోర్ డెలివరీ

- మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి భర్త ఇంటి వద్ద విడిచిపెట్టిన భార్య
- హత్యకు సహకరించిన ఆమె తమ్ముడు


మృతుడు రమణయ్య (ఫైల్)

నంద్యాల: భర్తను తన తమ్ముడితో కలిసి చంపేసి.. ఆపై మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి నంద్యాలలోని భర్త ఇంటి వద్ద విడిచిపెట్టింది. ఈ ఘటన నంద్యాలలో జరిగింది. నంద్యాల టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాలలోని నూనెపల్లెకు చెందిన రమణయ్య (50)కు పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన రమణమ్మతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి జ్యోతి, చందన, సాయి సంతానం. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా భార్య కొంతకాలంగా పుట్టిల్లు అయిన పిడుగురాళ్లలో ఉంటోంది. ఈ క్రమంలో భార్యతో మాట్లాడి ఇంటికి తీసుకొని రావడానికి భర్త పిడుగురాళ్లకు సోమవారం రాత్రి వెళ్లాడు. అక్కడ భార్య బంధువులు, రమణయ్య మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రమణమ్మ, ఆమె తమ్ముడు రామయ్య కలిసి, రమణయ్య కంట్లో కారం చల్లి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం తమ్ముడితో కలిసి భర్త మృతదేహాన్ని కారులో నంద్యాలలోని ఆయన ఇంటి వద్దకు తీసుకువచ్చి, మృతదేహాన్ని అక్కడ పడేసి పరారయ్యారు. మృతుడి ముఖంపై కారంపొడి ఉండటం..తల, వీపుపై గాయాలు ఉండటంతో రమణయ్య కుమార్తెలు జ్యోతి, చందన నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పిడుగురాళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి

శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ బాధితుల డిమాండ్


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో భవనాలు కోల్పోతున్న యజమానులకు హైకోర్టు ఆదేశాల మేరకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారాన్ని చెల్లించిన తరువాతే పనులు ప్రారంభించాలని బ్రాడీపేట–అరండల్‌పేట షాప్ ఓనర్స్ అండ్ కీపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శంకర్ విలాస్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే బ్రిడ్జి పనులు చేపట్టాలని హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ, అధికార యంత్రాంగం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. ఆర్వోబీ నిర్మాణంతో భవనాలు కోల్పోతున్న 58 మంది యజమానులకు నష్టపరిహారాన్ని ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ విధంగా దాదాపు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల మేరకు చెల్లించాల్సిన నష్టపరిహారంతో పాటు ఆర్వోబీ నిర్మాణ వ్యయం రూ.98 కోట్లను కలుపుకుంటే మెగా ఫ్లైఓవర్ నిర్మించవచ్చునని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ పక్కనపెట్టిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం హడావుడిగా పిల్లర్స్ నిర్మాణ పనులను చేపట్టారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన వర్క్ ఆర్డర్‌లోనే బ్రిడ్జ్ నిర్మాణానికి ముందుగానే రోడ్డు విస్తరణ పనులు, కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పూర్తి చేయాల్సి ఉందని, అధికారులు ఇవేవీ చేయలేదని విమర్శించారు. అధికారులు ఏకపక్ష వైఖరితో ముందుకు వెళితే కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని స్పష్టం చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే డిజైన్ ప్రకారం హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ వరకు మెగా ఫ్లైఓవర్‌ను, సింగిల్ పిల్లర్‌తో పాటు ఆర్‌యూబీలను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాలు సులభంగా ప్రయాణిస్తాయని తెలిపారు. 70 ఏళ్లుగా అభివృద్ధి చెందిన శంకర్ విలాస్ సెంటర్ ఉనికి దెబ్బతినకుండా ఉంటుందని చెప్పారు. ఎర్త్ వాల్‌తో కూడిన ప్రస్తుత డిజైన్ ద్వారా బ్రిడ్జిని నిర్మించడం ద్వారా ఈ ప్రాంతం పూర్తిగా నిర్వీర్యం అవుతుందని అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ నాయకుడు జి.కార్తిక్ మాట్లాడుతూ తాము బ్రిడ్జి నిర్మాణానికి, అభివృద్ధికి వ్యతిరేకం కాదని తెలిపారు. పరిహారం కింద బాండ్లు ఇస్తే తీసుకోబోమని, 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని కోర్టుకు వెళ్లగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. కోర్టు తీర్పును అమలు చేయాలని ఆయన కోరారు.

రైలు కిందపడి యువతి బలవన్మరణం

సత్తెనపల్లి: రైలు పట్టాలపై యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి రైల్వే గేట్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు గత కొన్ని నెలలుగా వెన్నాదేవిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. భార్య సోదరి వెన్నదేవిలోని వారి ఇంటికి వచ్చింది. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం రాత్రి విజయవాడ నుంచి లింగంపల్లి వెళ్లే రైలు వస్తుండగా 20 ఏళ్ల యువతి పట్టాలపై నిల్చుని బలవన్మరణానికి పాల్పడింది. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.